

రూ.1,01,115 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కాకర్ల వేంకటరమణ, విజయలక్ష్మి దంపతులు (త్యాగంపూడి) రూ.1,01,115 విరాళాన్ని బుధవారం సమర్పించారు.



డెల్టాకు 8,970 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.45 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సెహరీ శుక్ర (ఉ॥)
రాజమహేంద్రవరం	6.23	4.45
కాకినాడ	6.23	4.45
అమలాపురం	6.23	4.45

న్యూస్‌రీల్

మీడియా ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్

కాకినాడ సిటీ: ఎసెన్షియల్ సర్వీసెస్ కింద ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న మీడియా ప్రతినిధులు కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకోదలచిన కాకినాడ జిల్లా మీడియా ప్రతినిధులు ఇందుకు అవసరమైన ఫారమ్ 12 డి దరఖాస్తు పొందేందుకు తమ అక్రెడిటేషన్ కార్డు, ఇందులో జత పరిచిన 39 కాలమ్స్ ఎక్సెల్ షీట్‌లో నింపి ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటల్లోపు 9494156640 నంబరుకు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని జిల్లా పౌరసంబంధాల అధికారి నాగార్జున తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు వివరాలు రాని వారు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయడానికి ఆసక్తి లేదని నిర్ధారించుకొని జాబితాను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.

ఇస్రో స్పేస్ ట్యూటర్ ప్రోగ్రాంకు స్పార్క్



స్పార్క్ చైర్మన్ సాయిసందీప్‌ను సత్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఏలేశ్వరం: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)కు సేవలందించడానికి స్పార్క్ సంస్థ ఎంపికైనట్టు చైర్మన్ సాయిసందీప్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఇస్రో స్పేస్ ట్యూటర్ ప్రోగ్రాంకు రాష్ట్రంలో తొలిసారిగా తమ సంస్థ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. పట్టణానికి చెందిన స్పార్క్ సంస్థ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు అంతరిక్షం, ఇస్రో సేవలపై అవగాహన కల్పిస్తుంది. ప్రత్యేక సెమినార్లు నిర్వహించి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తుంది. శాస్త్ర, సాంకేతిక అంతరిక్ష విజ్ఞాన రంగంలో విద్యార్థులకు మార్గదర్శకం చేయగల అంతరిక్ష విద్యార్థుల సమూహాన్ని సృష్టించడం ఇస్రో లక్ష్యంగా పెట్టుకొంది. ఈ నేపథ్యంలో స్పార్క్‌ను ఎంపిక చేసింది. కాకినాడలో ఎస్పీ సతీష్‌కుమార్ చేతులమీదుగా సాయిసందీప్‌ను సన్మానించారు. ఇస్రోకు ఎంపికైన పత్రం ఎస్పీచేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సందీప్‌ను పలువురు అభినందించారు.

ఎన్నికల నిర్వహణపై ఆన్‌లైన్ శిక్షణ



ఆన్‌లైన్ శిక్షణలో పాల్గొన్న కాకినాడ మున్సిపల్ అధికారులు

బోట్‌క్లబ్: త్వరలో జరగనున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్నికల అధికారులకు బుధవారం ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు జమ్మూ కాశ్మీర్, లడక్, కేరళ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఎన్నికల అధికారులు హాజరయ్యారు. కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే. వెంకటరావు తోపాటు పలువురు అధికారులు కాకినాడ నుంచి ఆన్‌లైన్ శిక్షణకు హాజరయ్యారు. నామినేషన్ల అర్హత, అనర్హత, నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, పోలింగ్ రోజున చేయాల్సిన ఏర్పాట్లు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావుతో పాటు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు సంబంధించిన వివిధ బృందాల అధికారులు పి.సత్య కుమారి, ఎం. ఏసుబాబు, హరిదాసు, నాగశాస్త్రులు, దొర పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుబ్బల



పిఠాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండల జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. తనకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినందుకు ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గీత దాటితే వేటే

- పక్కాగా ప్రవర్తనా నియమావళి
- ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో తక్షణమే అమలులోకి
- ఉల్లంఘిస్తే ఈసీ చర్యలు తప్పవు

కాకినాడ సిటీ: ఈ నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెనువెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఈ నియమావళిని పాటించాలి. ఉల్లంఘన జరగకుండా ఎంసీసీ బృందాలు దృష్టి సారిస్తాయి. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,637 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి 152కు పైగా క్రిటికల్‌గా ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

సభల నిర్వహణ

- పార్టీ లేక అభ్యర్థి స్థానిక పోలీసు అధికారులకు తగినంత సమయం ఉండేలా ముందుగానే సభ నిర్వహించే ప్రదేశం, సమయాన్ని తెలియజేయాలి.



ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో విగ్రహానికి వేసిన ముసుగు

- సభ ఏర్పాటు ప్రదేశంలో నిషిద్ధాత్మక లేక నిర్బంధాత్మక ఆదేశాలు ఉన్నాయా లేదా అనేది సరి చూసుకోవాలి. ఆదేశాల నుంచి మినహాయింపు కోరినట్లయితే, దాని కోసం అభ్యర్థన ముందుగానే పంపి మినహాయింపు పొందాలి.
- సభలో లౌడ్ స్పీకర్లు వినియోగించేందుకు ముందుగానే సంబంధిత అధికారికి లిఖితపూర్వకంగా అభ్యర్థనను సమర్పించి అనుమతి పొందాలి.
- సమావేశాలు భగ్నం కలిగే విధంగా ప్రయత్నించే వ్యక్తులపై తప్పక చర్యలు తీసుకుంటారు.

ఊరేగింపులు

- ఊరేగింపును నిర్వహించే పార్టీ లేదా అభ్యర్థి కార్యక్రమం ప్రారంభించే సమయం ప్రదేశం, వెళ్లే మార్గం, ముగింపు సమయం, ప్రదేశం, తదితర విషయాలను ముందుగానే నిశ్చయం చేసుకోవాలి. దానిని అతిక్రమించరాదు. కార్యక్రమం గురించి స్థానిక పోలీసు అధికారులకు నిర్వాహకులు ముందుగానే తెలియజేయాలి.
- అభ్యర్థులు లేదా పార్టీలు ఒకే మార్గంలో ఊరేగింపు తలపెట్టినప్పుడు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులను సంప్రదించాలి.
- ఊరేగింపులో పాల్గొనే వ్యక్తులు ప్రమాదకర వస్తువులూ వెంట తెచ్చుకోకుండా రాజకీయ పక్షాలు, అభ్యర్థులు బాధ్యత వహించాలి. అలాంటి వస్తువులను అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేయవచ్చు.
- ఇతర రాజకీయ పార్టీల సభ్యులు లేదా నాయకుల దిష్టిబొమ్మలను మోసుకెళ్లడం, దహనం చేయడం, వ్యతిరేక ప్రదర్శన రూపాలను నిర్వహించకూడదు.



కాకినాడలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

ఇప్పటికే..

గత ఎన్నికల్లో కేసుల్లో ఉన్న రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌ను ఇప్పటికే బైండోవర్ చేశారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల వేళ మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే ఇతర వస్తువులను నియంత్రించేందుకు జిల్లా వ్యాప్తంగా 29 ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కాకినాడ, జగ్గంపేట, ఏలేశ్వరం, పెద్దాపురం, కత్తిపూడి, నీలపల్లి, సుంకరపాలెం, ఉప్పలంక తదితర ప్రాంతాల్లో ఇప్పటికే నిఘా పెట్టి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నాయి. అందులో భాగంగా ఇప్పటికే రెండు బీఎస్ఎఫ్ బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. వాటిని కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాలకు కేటాయించారు. జిల్లాలో 1088 సివిల్ పోలీసులు, 683 మంది ఆర్మ్‌డ్ పోలీసులను ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు సిద్ధం చేశారు. స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. రక్షణగా మేమున్నాం. స్వేచ్ఛగా ఓటు వేయండనే సంకేతంతో ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. మరికొన్ని బలగాలు త్వరలో రానున్నాయి.

రసీదు ఉండాలి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు రవాణాపై నిఘా పెరిగింది. మద్యం, నగదు, ఇతర వస్తువులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉండటంతో పోలీసు అధికారులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ పార్టీల నేతలు రూ.50 వేలకు మించి నగదు, రూ.10 వేలకు మించి విలువైన వస్తువులు రవాణా చేయడం నిషేధం. పార్టీల స్టార్ క్యాంపెయినర్ల వద్ద రూ.లక్షకు మించి నగదు ఉంచరాదు. పౌరులు రూ.50 వేలు మించి నగదు తీసుకెళ్లాలంటే అందుకు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు సంబంధించిన నగదు తీసుకెళ్లాలంటే వారి జాబితా, బ్యాంకు నుంచి డ్రా చేసిన రసీదు వివరాలు ఉండాలి. ఆస్పత్రులకు చెల్లించేందుకు డబ్బు తీసుకెళ్లాలంటే రోగికి సంబంధించిన వివరాలు తప్పనిసరి. రైతులు వ్యవసాయానికి సంబంధించిన వస్తువులు కొనుగోలుకు వెళుతుంటే వ్యాపార సంస్థల నుంచి ఇన్‌వాయిస్ లేదా కొటేషన్స్ తీసుకుంటే మేలు. భూములు, స్థలాలకు సంబంధించిన లాబాదేవీలైతే దస్తావేజులు, ఇతర ధ్రువీకరణపత్రాలు ఉంచుకోవాలి. పరిమితికి మించి నగదు తీసుకెళ్తే నగదుతోపాటు వాహనాలను సీజ్ చేస్తారు.

నియమావళి పాటించాలి



ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ పాటించాల్సిందే. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పని చేయాలి. రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

– కృతికా శుక్లా, కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

సాధారణ ప్రవర్తనా నియమావళి ఇదే...

- ఇది వరకే ఉన్న విభేదాలను మరింత పెంచేలా పరస్పర ద్వేషాన్ని రగిల్చేలా, కులాలు, జాతుల మధ్య మతపరమైన, భాషాపరమైన ఉద్రేకాలను కలిగించే కార్యకలాపాలను ఏ పార్టీ అభ్యర్థులు నిర్వహించరాదు.
- ఇతర రాజకీయ పార్టీలను విమర్శ చేసే పక్షంలో అధికార విధానాలకు, కార్యకలాపాలకు, పాత రికార్డుకు, పనికి మాత్రమే పరిమితమై ఉండాలి. ఇతర పార్టీల నాయకులు లేదా కార్యకర్తల వ్యక్తిగత జీవితపు అన్ని కోణాల విమర్శను పరిహరించాలి. ఆరోపణలు లేక వక్రీకరణలపై ఆధారపడి ఇతర పార్టీలు లేక వాటి కార్యకర్తలను విమర్శించరాదు.
- ఓటర్లకు లంచం ఇవ్వడం, బెదిరించడం, అసలు వ్యక్తులకు బదులు ఇతరులను ఓటర్లుగా వ్యవహరింపచేయడం చేయకూడదు. పోలింగ్ స్టేషన్లకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, పోలింగు పూర్తవడానికి నిర్ణయించిన సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహించకూడదు. పోలింగ్ స్టేషన్‌కి ఓటర్లను తరలించడం వంటి అవినీతి చర్యలకు శిక్ష తప్పదు.
- ప్రతి వ్యక్తికీ ప్రశాంతంగా, శాంతియుతంగా గృహ జీవితాన్ని గడిపే హక్కు ఉంది. వ్యక్తుల అభిప్రాయాలు లేక కార్యక్రమాలు తమకు వ్యతిరేకంగా ఉన్నాయంటూ వారి ఇంటి ముందు నిరసన వ్యక్తం చేయడం, వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించడం, పికెటింగ్ వంటివి చేయకూడదు.
- ప్రచారం కోసం జెండాలు కట్టడం, బ్యానర్ తరలించడం, నోటీసులు అతికించడం, నినాదాలు రాయడం తదితర పనులకు ఓ వ్యక్తి భూమి, భవనం, ప్రహరీని అతని అనుమతి లేకుండా ఉపయోగించరాదు.
- వేరొక పార్టీ సమావేశంలో మౌఖికంగా లేదా రాతపూర్వకంగా ప్రశ్నలు వేయడం, తమ పార్టీ కరపత్రాలు పంచడం లాంటి పనులు చేయకూడదు. ఓ పార్టీ జారీ చేసిన పోస్టర్లను మరో పార్టీ వారు తొలగించరాదు.

ఇతర గుర్తింపు కార్డులతోనూ ఓటేయొచ్చు



కృతికా శుక్లా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

కాకినాడ సిటీ: ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)కి ప్రత్యామ్నాయంగా 12 రకాల ఇతర గుర్తింపు కార్డులను చూపించి తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతికా శుక్లా బుధవారం తెలిపారు. లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2024లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎపిక్ కార్డులు (ఓటరు గుర్తింపు కార్డులు) ఉన్నవారు ఆ కార్డులను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఏపీక్ కార్డులు తీసుకురాలేని పక్షంలో ఎన్నికల జాబాతాలో పేర్లు నమోదైన ఓటర్లు 12 రకాల ఇతర గుర్తింపు కార్డులో ఏదో ఒక కార్డు తీసుకువచ్చి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు.

12 రకాల గుర్తింపు కార్డులు ఇవే..

ఆధార్ కార్డు, జాబుకార్డు, బ్యాంకులు లేదా పోస్ట్ ఆఫీసులు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ పుస్తకాలు, కార్మిక మంత్రిత్వశాఖ జారీచేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎస్పీఆర్ కింద ఆర్‌జీఈ జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ జారీ చేసిన దివ్యాంగుల గుర్తింపు కార్డు. ఓటరు గుర్తింపు కార్డులో స్పెల్లింగ్ తప్పులు ఉన్నా ఆ ఓటరు నిజమైన ఓటరేనని నిర్ధారించుకున్న తర్వాత ఓటు వేయడానికి అనుమతి ఇస్తారన్నారు. ఓటు వేసే పోలింగ్ స్టేషన్ ఎన్నికల జాబితాలో తమ ఓటు కలిగిన ఓటర్లు మరొక అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి జారీ చేసిన ఎపిక్ కార్డు ద్వారా కూడా ఓటు వేయడానికి అనుమతి ఇస్తారన్నారు. ఒకవేళ ఓటరు గుర్తింపు కార్డులో ఫొటో తప్పుగా ఉంటే మాత్రం ఇతర 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపి ఓటు వేయవచ్చని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. ఓటర్ల జాబితాలో నమోదైన ఓవర్సీస్ ఓటర్లు ఒరిజినల్ పాస్‌పోర్టును గుర్తింపుగా చూపి మాత్రమే ఓటు వేయవచ్చన్నారు. ఇతర గుర్తింపు కార్డులు అనుమతించబోరని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు.

పాదగయ హుండీ ఆదాయం రూ.24.56 లక్షలు



హుండీలలో నగదు లెక్కిస్తున్న సిబ్బంది

పిఠాపురం: పాదగయ క్షేత్రం హుండీ ఆదాయం రూ.24,56,485 సమకూరినట్లు ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. బుధవారం పెద్దాపురం మరిడమ్మ ఆలయ ఈఓ సీహెచ్ రామ్మోహనరావు, సామర్లకోట భీమేశ్వరస్వామి వారి ఆలయ ఈఓ నీలకంఠం దేవదాయశాఖ తనిఖీ అధికారి వి.ఫణికుమార్‌ల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించినట్లు ఆయన తెలిపారు. 92 రోజులకు గాను ఈ ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు. లెక్కింపులో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

‘తల్లి’డిల్లిన హృదయానికి పరీక్ష!

- చేబ్రోలు హత్య కేసులో మృతురాలి కుమారుడి దైన్యం



తల్లి మృతదేహానికి తల కొరివి పెడుతున్న కొడుకు మణికంఠ

పిఠాపురం: నీ కోసమే రేయింబవళ్లు కష్టపడుతున్నా, బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేయాలి, ఉన్నత స్థితికి వెళ్లాలి అంటూ ప్రోత్సాహించిన తల్లి ఇక లేదని తెలిసి బరువెక్కిన గుండెలను అదిమిపట్టి మరీ పరీక్ష రాశాడు ఆ కుమారుడు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో హత్యకు గురైన పెండ్యాల లోవమ్మకు ఇద్దరు కుమారులు. ఒక కుమార్తె ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడు 10వ తరగతి చదువుకుంటున్నాడు.మూడు రోజులుగా చేబ్రోలు హైస్కూలులో పదవ తరగతి పరీక్షలు రాస్తున్నాడు. తల్లి లోవమ్మ బుధవారం ఉదయాన్నే చేలోకి పనికి వెళుతూ నేను పనిలోకి వెళుతున్నా పరీక్ష బాగా రాయాలని చెప్పింది. తల్లి వెళ్లిన కొంతసేపటికే నిందితుడు నాగబాబు వాళ్ల ఇంటికి వచ్చి అమ్మమ్మ రామలక్ష్మిని కత్తితో నరికి పారిపోవడంతో కంగారు పడిన మణికంఠ ఆమెను ఆస్పత్రికి తరలించగానే పరీక్షలు రాయడానికి వెళుతుండగా తన తల్లిని కూడా చంపేసారని తెలియడంతో కన్నీరుమున్నీరయ్యాడు. చేలో విగత జీవిగా పడి ఉన్న తన తల్లిని చూసేందుకు వెళితే పరీక్షకు వెళ్లడం కుదరదని, తల్లి పోయిన బాధతో గుండెను రాయి చేసుకుని వెళ్లి పరీక్ష రాశాడని మృతురాలి బంధువులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ఒక పక్క తన జీవితానికి దారి చూపే పరీక్ష, మరోపక్క తనకు జీవితాన్నిచ్చిన తల్లి లేదన్న బాధ అతనికి విషమ పరీక్ష పెట్టాయి. పరీక్ష రాసి ఇంటికి వచ్చి తల్లిని కడసారిగా చూసి నేను పరీక్ష పాసయితే మెచ్చుకునే వారెవరమ్మా అంటూ మణికంఠ విలపిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. పెద్ద కుమారుడైన మణికంఠ తల్లికి అంతిమ సంస్కారం నిర్వహించాడు. హిందూ సంప్రదాయం ప్రకారం తల్లికి తల కొరివి పెడుతూ అతను కన్నీరుమున్నీరుగా విలపించడం కలచివేసింది.

ఎన్నికలకు ‘సిద్ధం’ కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి, ద్వారంపూడి

- పార్టీ శ్రేణులకు చలమలశెట్టి, ద్వారంపూడి పిలుపు
- కాకినాడ సిటీ విస్తృత సమావేశం

కాకినాడ: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కాకినాడ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక డీ కన్వెషన్‌లో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన బుధవారం సాయంత్రం పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశంలో చలమలశెట్టి, ద్వారంపూడి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా 30 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చామన్నారు. నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. సచివాలయ, వలంటీరు వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే మెరుగైన పాలన అందించి కుల, మత రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకమైన పాలన అందించారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు తెలియజెప్పి ఘన విజయం సాధించడానికి, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ, ఎమ్మెల్యేలుగా తమని గెలిపించడానికి శక్తివంచన లేకుండా పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరారు. ప్రధానంగా రాజకీయ లబ్ధి కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ అనైతిక కూటమి ఇచ్చే మోసపూరిత హామీలను, తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, కాకినాడ పార్లమెంట్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, మాజీ డిప్యూటీ మేయర్‌లు మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి ప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు, వివిధ డివిజన్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రబీకి సీలేరు జలాల విడుదల

మోతుగూడెం (అల్లూరి జిల్లా): లోయర్ సీలేరు జల విద్యుత్ కేంద్రాల నుంచి రబీ అవసరాలు ఉభయ గోదావరి జిల్లాలకు బుధవారం నుంచి 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు చీఫ్ ఇంజినీర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలకృష్ణ తెలిపారు. జల విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ఆదేశాల మేరకు రోజుకు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు వారు చెప్పారు. ఇరిగేషన్ అధికారులు ఇంకా ఎక్కువ నీటిని విడుదల చేయాలని ఆదేశిస్తే డొంకరాయి డ్యామ్ ద్వారా విడుదల చేస్తామన్నారు. గత సంవత్సరం రబీ అవసరాలకు సుమారు 13 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.



కెనాల్ ద్వారా నీటి విడుదల

ఈదురు గాలులు, వడగళ్ల వాన



కాకినాడలో వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- పలు ప్రాంతాల్లో నేలకొరిగిన వృక్షాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వాతావరణశాఖ ముందస్తుగా హెచ్చరించిన విధంగా జిల్లాలో బుధవారం ఈదురుగాలులు, భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వాతావరణం చల్లగానే ఉంది. సాయంత్రం ఐదుగంటలకు ఒక్కసారిగా ఈదురుగాలులు వీచి హోరున వర్షం కురవడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో, ప్రధాన రహదారులపై వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సుమారు అరగంట పాటు జిల్లాలో జనజీవనం స్తంభించిపోయింది. నడకుదురులో ఈదురుగాలులకు వృక్షం ప్రధాన రహదారిపై పడడంతో వాహనచోదకులు పడరానిపాట్లు పడ్డారు. సుమారు గంట పాటు ఇబ్బంది పడాల్సి వచ్చింది. కరప మండలంలో ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని తొండంగి, పెద్దాపురం, సామర్లకోట, తుని, గోకవరం, జగ్గంపేట, ప్రత్తిపాడు, కాకినాడతో వివిధ ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసింది. పెదపూడి మండలం రామేశ్వరంలో పిడుగుపాటుకు రెండు కొబ్బరిచెట్లు కాలిపోయాయి. ప్రత్తిపాడు మండలం టి.రాయవరంలో పిడుగుపాటుకు ఒక వ్యక్తి మరణించాడు. ప్రస్తుత వర్షం వల్ల వరి పంటకు పెద్దగా నష్టం ఉండదని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.విజయ కుమార్ తెలిపారు. మెట్టప్రాంతంలో రైతులకు ఈ వర్షం మేలు చేస్తుందన్నారు. పలు మండలాల్లో శివారు ప్రాంత రైతులు నీరు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఈ వర్షాలు ఆయా పొలాలకు ఉపయోగమన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులకు వరి పైరు నేలకొరిగిందన్నారు. అయితే ఉద్యానశాఖ పంటలకు మాత్రం నష్టం ఉంటుందన్నారు. మామిడి ప్రస్తుతం పిందె దశలో ఉండడంతో ఈదురుగాలులకు రాలిపోయి రైతుల నష్టం వచ్చే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీ మృతి

తుని రూరల్: తుని మండలం టి.తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ బోడపాటి కొండతల్లి (53) అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయాన్ని ఆమె కుమారుడు బోడపాటి రాజు బుధవారం తెలిపారు. కొండతల్లి ఈ నెల 19న ఉపాధి పనులకు వెళ్లింది. తిరిగి వచ్చే సమయంలో అస్వస్థతకు గురైంది. వెంటనే కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై ఏపీఓ పసుపులేటి నారాయణరావును వివరణ కోరగా కొండతల్లి మృతి చెందిన విషయాన్ని డ్వామా పీడీకి తెలియజేస్తామన్నారు.

24న బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

ఆలమూరు: స్థానిక మదర్ థెరిస్సా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ అకాడమీ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో ఈ నెల 24వ తేదీన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండపేటలోని ఆశ్రమ పాఠశాలలో ఆరోజు ఉదయం ఐదు నుంచి సాయంత్రం వరకూ ఈ టెస్టింగ్ పోటీలు జరుగుతాయన్నారు. సుమారు 150 మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఎల్లో, గ్రీన్, బ్లూ, రెడ్ బెల్ట్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

పిడుగు పడి పశువుల కాపరి మృతి


మహేష్ మృతదేహం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని టి.రాయవరంలో బుధవారం సాయంత్రం పిడుగు పడి పశువుల కాపరి మృతి చెందాడు. గ్రామానికి చెందిన పత్తేటి మహేష్ (28) పొలాల్లో పశువులను మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా, గ్రామానికి చెందిన కొండి సత్తిబాబు స్వల్పంగా గాయపడాడు.

వ్యక్తి అదృశ్యం

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామంలోని మాగాపువారి పేటకు చెందిన గెద్దాడ శ్రీనివాసరావు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం పెళ్లి భోజనానికి అమలాపురం మండలం వేమవరం వెళ్లాడు. అప్పటి నుంచి అదృశ్యమయ్యాడు. దీనిపై అతని కుమారుడు సతీష్‌కుమార్ బుధవారం అయినవిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై బి.రాజేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊపిరి తీసిన వివాహేతర సంబంధం

- చేబ్రోలులో ఇద్దరి దారుణ హత్య
- మరొకరి పరిస్థితి విషమం
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు


సంఘటనాస్థలంలో తీవ్ర గాయాలతో రామలక్ష్మి


లోవమ్మ (ఫైల్)


శ్రీనివాసు (ఫైల్)

పిఠాపురం: వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణాలు తీసింది. మరొకరిని ప్రాణాపాయస్థితికి తీసుకెళ్లింది. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన పోసిన శ్రీనివాసు (45), పెండ్యాల లోవమ్మ (35)లను అదే గ్రామానికి చెందిన లోకా నాగబాబు కత్తితో నరికి చంపాడు. లోవమ్మ తల్లి రామలక్ష్మిపైనా దాడి చేయడంతో ఆమె కొన ఊపిరితో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. వివరాల్లోకి వెళితే.. పెండ్యాల లోవమ్మ భర్తకు దూరంగా ఒంటరిగా ఉంటోంది. గ్రామానికి చెందిన లోకా నాగబాబుతో సహజీవనం చేస్తోంది. ఇటీవల పోసిన శ్రీనివాసుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. దీంతో ఆమెను నాగబాబు పలుమార్లు హెచ్చరించాడు. తన మాట వినకపోతే చంపేస్తానని బెదిరించాడు. అయినా ఆమె వినకపోవడంతో కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 20 రోజులుగా శ్రీనివాసు, లోవమ్మలను వెంబడిస్తున్నాడు. ప్రతి రోజూ శ్రీను తన మోటారు సైకిల్‌పై లోవమ్మను తన పొలంలోకి పనులకు తీసుకెళ్లడం గమనించాడు. ఎలాగైనా వారిద్దరినీ చంపాలని నిర్ణయించుకున్నాడు.

మాటు వేసి దాడి

లోకా నాగబాబు మంగళవారం అర్ధరాత్రి చేబ్రోలు శివారు లక్ష్మీపురం పొలిమేరలో ఉన్న శ్రీనివాసు పొలానికి కత్తి తీసుకుని వెళ్లాడు. తన మోటారుసైకిల్‌ను దూరంగా పొదల్లో దాచాడు. అక్కడ బెండ తోట పక్కనే ఉన్న నువ్వుల చేనులో దాకున్నాడు. కాగా.. శ్రీనివాసు తన పొలంలో బెండకోత కోసం నలుగురు కూలీలను మాట్లాడుకుని బుధవారం ఉదయం 4.30 గంటలకు వారిని రమ్మని చెప్పాడు. ముందుగానే లోవమ్మను తీసుకుని పొలానికి వెళ్లిపోయాడు. అక్కడే నువ్వుల చేలో దాక్కున్న నాగబాబు వారిద్దరిపై కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం లోవమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆమె తల్లి రామలక్ష్మిపై కత్తితో దాడి చేశాడు. ఆమె కేకలు విని స్థానికులు అక్కడకు వచ్చేసరికీ నాగబాబు పరారయ్యాడు. కాగా.. బెండకాయల కోతకు వచ్చిన కూలీలు పొలంలో లోవమ్మ, శ్రీనివాసు మృతదేహాలను చూశారు. స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోసిన శ్రీనివాసుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. లోవమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాగబాబు గత 20 రోజులుగా కత్తి తీసుకుని శ్రీనివాసు పొలంలో తిరగడాన్ని సమీపంలోని రైతులు గమనించారు. ఈ విషయాన్ని శ్రీనివాసుకు చెప్పినా అతడు పట్టించుకోలేదు. నాగబాబు గతంలో లోవమ్మ వెంటబడిన ఒక వ్యక్తి చెయ్యి నరికాడని, ఈ ఘటనపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారని స్థానికులు తెలిపారు. అడిషనల్ ఎస్పీ భాస్కరరావు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం: ర్యాలి గ్రామంలోని మిద్దే భాగ్యలక్ష్మి ఇంటిలో ఈ నెల 12వ తేదీన 32 గ్రాముల బంగారం చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన వెంకట్రావు పల్లపురాజును బుధవారం అరెస్టు చేసి, అతడిని నుంచి బంగారం రికవరీ చేసినట్టు ఎస్సై తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

బెండపూడి చెక్‌పోస్టు నిలిపివేత

తొండంగి: దేశవ్యాప్తంగా జీఎస్టీ అమలు చేసిన నేపథ్యంలో అంతర్రాష్ట్రీయంగా బెండపూడి జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న రవాణా శాఖ చెక్‌పోస్టు సేవలను నిలిపివేశారు. కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చెక్‌పోస్టులను నిలిపివేస్తూ జీఓ 24 ద్వారా ఈనెల 15న ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు బెండపూడిలో చెక్‌పోస్టు వద్ద సేవలను రవాణాశాఖ అధికారులు సేవలు నిలిపివేశారు. వాహనాల టెంపరరీ పర్మిట్లకు సంబంధించి ఆన్‌లైన్ యాప్ ద్వారా సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రైస్‌మిల్లులో ఇద్దరు మహిళా కూలీల మృతి


లలితా రైస్‌మిల్లులో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

పెద్దాపురం: రైస్‌మిల్లులో కూలి పనికి వెళ్లిన ఇద్దరు మహిళలు లారీ ఢీకొని మృతి చెందారు. పెద్దాపురం మండలం వాలు తిమ్మాపురం రహదారిలోని లలితా రైస్‌మిల్లులో బుధవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. పెద్దాపురంలోని రాజీవ్ కాలనీకి చెందిన కామిశెట్టి కామేశ్వరి (51), మండలంలోని కట్టమూరుకు చెందిన మోతుపల్లి నాగరత్నం (65) బుధవారం ఉదయం రైస్‌మిల్లులో పనికి వెళ్లారు. రోజూ మాదిరిగానే శుభ్రం చేస్తుండగా వర్షం పడుతుండడంతో మిల్లులోని గోడ పక్కన నిలబడ్డారు. ఈలోపు వర్షం కారణంగా లారీని డ్రైవర్ వెనకకు నడుపుతున్న క్రమంలో గోడ పక్కన నిలబడిన మహిళలను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన వారిని యాజమాన్యం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. మృతురాలు నాగరత్నానికి నలుగురు కుమారులు. ఒంటరిగా పింఛన్ సొమ్ముతో జీవిస్తూ రైస్‌మిల్లులో కూలికి వెళుతోంది. కామేశ్వరికి భర్త లేదు. రైస్ మిల్లులో కూలి పని మీద ఆధారపడి బతుకుతోంది. ఈ ఘటనపై ఎస్సై వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ. 93.10 లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.93,10,393 వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈవో భూపతిరాజు కిషోర్ కుమార్ తెలిపారు. 28 రోజులకు ప్రధాన హుండీల నుంచి రూ.71,44,868 అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.21,65,525 లభించిందన్నారు. విదేశీ కరెన్సీతో పాటు 40 గ్రాముల బంగారం, కేజీ వెండిని భక్తులు హుండీల్లో వేశారన్నారు. ఆలయ క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ 2,36,159 సమకూరినట్టు తెలిపారు. కాగా.. హుండీలో పువ్వులు, తులసి మాలలు వేయడంతో కరెన్సీ నోట్లు పాడవుతున్నాయని భక్తులు గమనించాలని కోరారు. లెక్కింపు కార్యక్రమం పర్యవేక్షణ అధికారిగా కోనసీమ జిల్లా డీఈఓ, అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం ఈవో ఎం.రాధాకృష్ణ, గోపాలపురం ఆలయ ఈఓ బి.కిరణ్, ఆత్రేయపురం ఈఓ బి.నరేంద్రకుమార్ వ్యవహరించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నరసన్న కల్యాణం.. కన్నుల వైభవం

- ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం
- అంతకు ముందు రథోత్సవం
- తరలివచ్చిన భక్తులు


కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి వారి రథోత్సవం

మధురపూడి: కోరుకొండలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో స్వామివారి కల్యాణ మంటపంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణ క్రతువు నిర్వహించారు. పండితుడు పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు, దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ ఎస్వీ రంగరాజ బట్టర్, అర్చక స్వాములు పెద్దింటి, పెదపాటి పర్యవేక్షణలో వేడుక జరిగింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు, వైఎస్సార్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం

కల్యాణోత్సవానికి ముందు మధ్యాహ్నం 1.58 గంటలకు స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. తొలుత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ఆశీనులు చేశారు. అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ రథాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రారంభించారు. కొండ దగ్గర నుంచి దేవస్థానం రోడ్డు, సుజలా డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, రెడ్డి పంతులు సత్రం, పాత సంత మార్కెట్, వడ్డీల పేట, మత్స్యకారుల వాడ, ఎయిర్ టెల్ టవర్, సాయిబాబా గుడి, అంకాలమ్మ గుడి, శివాలయం మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యం, బ్యాండ్ మేళాలు, కోలాటం, తీన్ మార్, శక్తి వేషధారణలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. రథం దేవస్థానానికి చేరుకోగానే ఎదుర్కోలు కార్యక్రమంలో భాగంగా మేళతాళాలతో నరసింహస్వామి, లక్ష్మీదేవిని ఆలయంలోకి తీసుకెళ్లారు. కాగా.. జోరున వర్షం పడుతున్నా భక్తులు ఉత్సాహంగా రథోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, సంక్షేమ పాలనను అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ సీఎంగా అవకాశం కల్పించాలని స్వామివారిని కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్, డీసీ రమేష్‌బాబు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీజేపీ రాష్ట్ర నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ అడపా నాగమురళీ, ఎస్సై ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజా


నరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జిల్లా గనులు మరియు
భూగర్భ శాఖ అధికారి, కాకినాడ.

టెండర్ నోటీసు నెంబర్: 2396/Q/2023 తేది.18.03.2024.

ఆంధ్ర ప్రదేశ్ చిన్న తరహా ఖనిజ నియమావళి – 1966 ప్రకారము షెడ్యూల్ -1 నందు సూచించిన మట్టి/గ్రావెల్ ఖనిజమును, దుమ్ములపేట గ్రామం, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా సర్వే నెం. 374,376 & 387 నందు గల 310788.96 క్యూబిక్ మీటర్ల మట్టి/గ్రావెల్ ఖనిజమును నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారి ఆదేశము ప్రకారం తొలగించుట నిమిత్తం ది.08.04.2024 న జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి, కాకినాడ వారు రెండవ సారి ఎలక్ట్రానిక్ ఆక్షన్ (ఈ – ఆక్షన్) ద్వారా వేలం నిర్వహిస్తున్నారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు ఈ https://konugolu.ap.gov.in పోర్టల్ ద్వారా పూర్తి వివరాలను పొందవచ్చును. టెండర్ డాక్యుమెంట్లు https://konugolu.ap.gov.in ద్వారా 19.03.2024, 3.00 AM గం., IST నుండి అందుబాటులో ఉంటాయి.

మరిన్ని ఇతర వివరాల కోసం సంప్రదింపగలరు: ఈ. నరసింహ రెడ్డి, జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి కాకినాడ ఫోన్ నెంబర్ : 9100688814.

సం/- ఈ.నరసింహారెడ్డి,
జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి, కాకినాడ.

ఆర్టీసీ బస్సు–ఆటో ఢీ

ముగ్గురికి గాయాలు


చొల్లంగి వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జయిన ఆటో

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని చొల్లంగి వద్ద బుధవారం రాత్రి ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు, యానాం నుంచి కాకినాడ వైపు వెళుతున్న ఆటోను, ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదం ధాటికి ఆటో నుజ్జయింది. ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. ఇలాఉండగా ఈ సంఘటనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుకిరువైపులా సుమారు కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోరంగి పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పాయకరావుపేటలో లక్కీ షాపింగ్‌మాల్ ప్రారంభం


లక్కీ షాపింగ్ మాల్‌లో చీరలను ప్రదర్శిస్తున్న సినీనటి అనసూయ

పాయకరావుపేట: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్ మాల్ బుధవారం ప్రారంభమైంది. అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు బీవీ సత్యవతి, సినీ నటి అనసూయ భరద్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి హాజరైన అనసూయ భరద్వాజ్ ముందుగా షాపింగ్ మాల్ బయట ఏర్పాటు చేసిన స్టేజీపై నుంచి ప్రేక్షకులకు అభివాదం చేశారు. షాపింగ్ మాల్ ప్రధాన ద్వారం వద్ద రిబ్బన్ కట్ చేశారు. క్యాష్ కౌంటర్ వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సత్యవతి లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభ సూచనగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనసూయ మాట్లాడుతూ పాయకరావుపేటలో ఇంత పెద్ద షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. షాపింగ్ మాల్ అధినేతలు సీరం రత్తయ్య, గ్రంధి శ్రీనివాసరావు, గ్రంధి సుబ్రమణ్యం (స్వామి)మాట్లాడుతూ తమ షోరూమ్‌లో నాణ్యత గల వస్త్రాలను అందుబాటు ధరలలో అందజేస్తామన్నారు. తుని, పాయకరావుపేటకు చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపార వేత్తలు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824380]

ASTROLOGY

■ ఓం శక్తి జ్యోతిష్యాలయం: వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం, చదువు, ప్రేమ, పెళ్లి, సంతానం, విదేశీయానం, రాజకీయం, ధనం ఇంకా ఎటువంటి సమస్యలకైనా 9 రోజులలో శాశ్వత పరిష్కారం. వశీకరణ స్పెషలిస్ట్ గురూజీ: దుర్గాప్రసాద్ రాజు – 9849957621 [W-1264906]

Wanted

■ హైదరాబాద్‌లోని ఆస్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోడానికి 21-45వయసు గల M/F కేర్ టేకర్స్ కావలెను. జీతం: 16-20వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ గలవు. సంప్ర: 9381848549 [G-1685]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233894]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1167549]

■ కష్టలేన్డీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000 -40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd Ph: 7995984445 [HA-1385]

■ మదర్ థెరిసా హోం కేర్ సర్వీసెస్ Hyd లో శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవ చేయుటకు 20-40 సం॥ వయసు గల స్త్రీ/పు. కావలెను. జీ: 15000/-18000/- మరియు 2 వీలర్ డ్రైవర్స్ కావలెను. ఫోన్: 9553681000, 9553684000. [H-801497]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13624]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మదరసా.. భవితకు భరోసా

- ముస్లిం బాలలకు హాఫిజ్ శిక్షణ
- ఇంగ్లిషు, ఉర్దూ, అరబ్బీలపై అవగాహన
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆరు మదరసాలు


కొత్తపేట మండలం పలివెల మదరసాలో బాలలకు శిక్షణ ఇస్తున్న ఇమామ్ మహ్మద్ అబ్దుల్లా ఖాదిరీ

కొత్తపేట: ముస్లిం బాలలకు ఖురాన్ పఠనంతో పాటు ఉర్దూ, ఇంగ్లిషు భాషలతో విజ్ఞాన సముపార్జనకు మదరసాలు దోహదపడుతున్నాయి. పేదల పిల్లలు, అనాథ బాలలు, బాల కార్మికులుగా మగ్గుతున్న పిల్లలకు ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నారు. వారికి విద్యాబుద్ధులు చెప్పించి, సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇవి పనిచేస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం అర్బన్‌లో ఒకటి, రూరల్‌లో రెండు, కాకినాడ అర్బన్, సఖినేటిపల్లి, రావులపాలెంలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఆరు రిజిస్టర్డ్ మదరసాలు ఉండేవి. అయితే రావులపాలెం మదరసా కోవిడ్‌లో లాకౌట్ అయ్యింది. ఇవి కాకుండా సుమారు రెండేళ్ల క్రితం కొత్తపేట మండలం పలివెలలో ఒక మదరసా ఏర్పడింది. అక్కడ 19 మంది, పై ఐదు సెంటర్లలో 266 మందితో మొత్తం 285 బాలలు శిక్షణ పొందుతున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ సెంటర్‌లో ప్రత్యేకంగా 46 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారు.

బాలలకు శిక్షణ

మదరసాల్లో ఉర్దూ, అరబ్బీ, ఇంగ్లిషు భాషలకు సంబంధించి బాలలకు నజీమ్‌లు శిక్షణ ఇస్తారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, సెకండరీ స్థాయిల్లో శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణలో ముఖ్యంగా ఖురాన్‌లో 30 భాగాలు ఉంటాయి. పిల్లల మేధస్సు, తెలితేటలను బట్టి రెండు నుంచి నాలుగు ఏళ్లలో శిక్షణ పూర్తవుతుంది. ఈ శిక్షణానంతరం ఉర్దూ ఉపాధ్యాయ అభ్యర్థులుగా, హాఫిజ్ (ఖురాన్ చూడకుండా చదవడం)పై అర్హత సాధిస్తారు. ఆయా మదరసాల ద్వారా సర్టిఫికెట్ పొందుతారు. దాని ద్వారా మసీదుల్లో ఇమామ్ (మత గురువు)గా ప్రార్థనలు చేయడానికి కూడా అర్హులవుతారు. ఉదాహరణకు కొత్తపేటకు చెందిన జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మహ్మద్ హరుణ్ కుమారుడు మహ్మద్ సల్మాన్ బెంగళూరులో రెండేళ్ల ఖురాన్ హాఫిజ్ శిక్షణ పొంది, మసీదు ఇమామ్‌గా అర్హత సాధించారు. సుమారు రెండేళ్లుగా నడుస్తున్న కొత్తపేట మండలం పలివెల మదరసాలో 21 మంది విద్యార్థుల్లో ఇద్దరు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసి వారి స్వగ్రామాలకు వెళ్లారు.

దాతల సహకారంతో..

ఈ మదరసాలు దాదాపు దాతల సహకారంతో నడుస్తున్నాయి. ధనిక ముస్లింలు ఏడాదికి ఒకసారి తమ సంపాదనలో జకాత్ (రూ.లక్షకు రూ.రెండున్నర వేలు చొప్పున) ఇస్తారు. ఆ మొత్తంలో కొంత భాగం మదరసాలకు కేటాయిస్తారు. అలా మదరసాలు నడుస్తున్నాయి. పలివెల మదరసాలో శిక్షణ పొందుతున్న బాలల్లో ఎక్కువ మంది పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వారే. వారికి దుబాయ్‌లో స్థిరపడిన మండపేట వాసి షేక్ జమీర్, కొత్తపేట మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ ఖాజాబాబు తదితర దాతలు సహకరిస్తున్నారని పలివెల మసీదు ఇమామ్ మహ్మద్ అబ్దుల్లా ఖాదిరీ హబీబీ తెలిపారు.

రెండేళ్లలో హాఫిజ్ అర్హత సాధించాను



కొత్తపేటలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఐదోతరగతి వరకూ ప్రాథమిక విద్య అభ్యసించాను. తర్వాత రెండేళ్లు రాజమహేంద్రవరం సమీపంలోని కొంతమూరు మదరసాలో చదివాను. తరువాత బెంగళూరు దారుల్ ఉలూమ్ సబీల్ రషాద్ అనే సంస్థలో ఉర్దూ, అరబిక్‌తో పాటు ఖురాన్ పఠనం చేశాను. ఖురాన్‌ను చూడకుండా చదవటంలో హాఫిజ్‌గా అర్హత సాధించాను. ఖురాన్‌లో 30 భాగాలను అలవోకగా చదువుతూ దానిలో అర్థాన్ని, పరమార్థాన్ని వివరించగలను. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను.

– మహ్మద్ సల్మాన్, హాఫీజ్, కొత్తపేట

బలోపేతానికి కృషి



అనాథ, పేద పిల్లలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే మదరసాలను బలోపేతం చేసేందుకు వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నా వంతు కృషి చేస్తా. అనాదిగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో రిజిస్టర్డ్ మదరసాలుగా నడిచే ఈ సంస్థల బాగోగులను బీజేపీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం గాలికొదిలేసి నిర్వీర్యం చేసింది. ఈ మదరసాల విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, వాటికి ప్రత్యేక నిధులు కేటాయించి, మరింతమందికి అన్ని సౌకర్యాలతో కూడిన శిక్షణ ఇప్పించేలా కృషి చేస్తా.

– షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్, అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



మదరసాలో విద్యను అభ్యసించే అనాథ, పేద పిల్లలకు ధార్మిక విద్యతో పాటు మోడరన్ ఎడ్యుకేషన్, ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా మదరసా బోర్డు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకురాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఎక్కడ మంచిపేరు వస్తుందోనని కొందరు రాజకీయ నాయకులు అడ్డుపడ్డారు. నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన సీఎం జగన్ మదరసాల అభివృద్ధికి ధృఢ సంకల్పంతో ఉన్నారు.

– షేక్ అజహర్, మదరసా యూనియన్ నాయకుడు, రావులపాలెం